# భగవన్నామ సంకీర్తన పంచభూతములను పవిత్రము గావిస్తుంది

నాస్తి నాస్తి మహాభాగ! కలికాలసమం యుగం
స్మరణాచ్చింతనాదేవ ప్రాప్తాహి పరమాగతిః

కోటీశ్వరుడైన కూడుగుడ్డయెగాని
బంగారమును తిని బ్రతుకలేడు
కాలమేగాకున్న కఱ్ఱయే పామగును
కలసి వచ్చిన మట్టి కనకమగును
పండితుడొకచోట పశువుగా మారును
మూర్ఖుండొక తరిని మునిగ మారు
ధనవంతునొకపరి దారిద్ర్య దేవత
వరించి ప్రేమతో వరుసలాడు
ప్రాకులాటయెగాని ప్రాప్తియే లేకున్న
దమ్మిడయిన నీకు దరికి రాదు
వద్దు బాబు వద్దు హద్దు మీరిన ఆశ
బుద్ధి కలిగి జీవించుమో పెద్దమనిషి
బుద్ధితో మెలగుము సాయివద్ద.

ప్రేమస్వరూపులారా!

అనేకత్వములోని ఏకత్వమును గుర్తింపజేయునది సంకీర్తన

sri sathyasai vachanamrutam

'సమ్యక్ కీర్తనం యితి సంకీర్తనం'. కీర్తనమునకు, సంకీర్తనమునకు ఎంతయో వ్యత్యాసమున్నది. కీర్తన కేవలము వ్యక్తిగతమైనది. తన ప్రాప్తి నిమిత్తము తాను ప్రాకులాడునటువంటిది. సంకీర్తన అనగా యావత్ విశ్వమునకే కళ్యాణము చేకూర్చునది. 'సామూహిక భజన' అని దీనికి పేరు. యిది మొట్టమొదట సిక్కుల గురువైన గురునానక్ ప్రారంభించినటువంటిది. ఈ సంకీర్తన అన్నది అనేకత్వములోని ఏకత్వమును గుర్తింపచేయునటువంటిది. అందరి కంఠములు చేరి ఒక్క కంఠముగా ఏకత్వముగా ఉచ్చరించే భజనకు 'సంకీర్తన' అని పేరు. ఈ సంకీర్తన అనేది నాలుగు విధములుగా వుంటున్నది. ఒకటి గుణ సంకీర్తన. రెండవది లీలా సంకీర్తన. మూడవది భావ సంకీర్తన. నాల్గవది నామ సంకీర్తన. గుణ సంకీర్తన అనగా భగవంతుని కళ్యాణ గుణములను మాత్రమే వర్ణిస్తూ తాదాత్మ్యము పొంది తన జీవితమందు అట్టి సద్గుణములను ఏర్పరుచుకొనుటకు తగిన కృషి చేయటము. ఈ గుణ సంకీర్తన త్యాగరాజు గావించినటువంటిది.

**వాచామ గోచరుండని నీ చరితమును పొగడ బ్రహ్మాదులకునైన**
**తరమా! హే కృష్ణా!**
**కాచుకొన్నాను నీదు కృపకై మొరాలకించి నన్ను బ్రోవుమయ్య**
**కాలుడు గొనిపోయిన గురుపుత్రుని తెచ్చి యిచ్చినావు**
**కాలుని మదమణచినావు**
**వసుదేవ దేవకీ చెరను విడిపించినావు**
**వాల్గంటియైన ద్రౌపది బ్రోచినావు**
**మేలు మేలు పాండవులను కాచినావు**
**కుచేలుని ఆర్తి తీర్చినావు**
**కురూపియైన కుబ్జ వక్రములను పోగొట్టినావు**
**పదహారు వేల రమామణులను బ్రోచినావు**
**వాచామ గోచరుండని....**

srisathyasaivachanamrutam

'యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అని, వాక్కునకు అలవికాని గుణములు నీయందున్నవని ఈ విధంగా త్యాగరాజు వర్ణిస్తూ వచ్చాడు.

లీలా సంకీర్తనమనగా యిది కేవలము పవిత్రమైన భగవంతునియొక్క లీలా తరంగములను నృత్యముగా ఆడుకుంటూ ఆయొక్క లీలలను తాను అనుభవిస్తూ ఆ లీలలయందు లీనమైవుండే తత్వము, లీలా సంకీర్తన.

ఇంక భావసంకీర్తన. కృష్ణభక్తురాలైన రాధమాత్రమే దీనిని పరిపూర్ణంగా అనుభవిస్తూ భగవంతునియొక్క భావమునందు లీనమై తన తత్వమును భగవత్ తత్త్వములో లీనము చేసుకున్నటువంటిది. శాంత భావము, సఖ్య భావము, వాత్సల్య భావము, అనురాగ భావము, మధుర భావము అనే యీ ఐదు భావములందు తనయొక్క జీవితమును అనుభవిస్తూ వచ్చింది. కనుక రాధ, మీరాలయొక్క పవిత్ర భావము యీ భావ సంకీర్తనగా రూపొందుతూ వచ్చింది.

నామసంకీర్తన. యిది కేవలము చైతన్యుడు మాత్రమే సలుపుతూ వచ్చాడు. 'సర్వనామములు నీయొక్క నామములే! నీ నామములేని జగత్తుగానీ, నీ రూపము లేని జగత్తుగానీ యీ విశ్వమునందు కానరాదు,' అనే భావనతో సర్వకాల సర్వావస్థలలో తాదాత్మ్యముతో భగవన్నామ సంకీర్తన చేస్తూ వచ్చాడు, చైతన్యుడు.

**సర్వరూపధరం శాంతం సర్వనామధరం శివం**
**సచ్చిదానందరూపం అద్వైతం సత్యం శివం సుందరం.**

"యీ జగత్తుయొక్క సౌందర్యమంతయు నీ నామరూపములే, భగవంతుడా!" అని ప్రతి పదార్థమును, ప్రతి అణువును, ప్రతి కణముకూడను భగవత్ స్వరూపముగా భావించి, నామముచేత తరించినవాడు చైతన్యుడు.

**గుణ, లీలా, భావ, నామ సంకీర్తనల సమ్మిళిత స్వరూపమే భజన**

అయితే, అదృష్టవశాత్తూ ఆయా యుగములందు ఒక్కొక్కరు ఒక్కొక్క విధమైన మార్గము ననుసరించుచుండగా ప్రశాంతినిలయవాసులు యీ నాల్గింటినికూడ అనుభవించటమనేది

sri sathyasai vachanamrutam

మహా అదృష్టము. గుణ సంకీర్తన, లీలా సంకీర్తన, భావ సంకీర్తన, నామ సంకీర్తన, నాల్గింటియొక్క సమ్మిళితమైన స్వరూపమే మనయొక్క భజన. ఈ నాల్గింటికి విశిష్టమైన, విలక్షణమైన మార్గము మరొకటున్నది. 'నామ లిఖితము' అని భగవంతుని మనస్సునందు తలంచుచు, మాటతో స్మరించుచూ, చేతితో నామమును లిఖించటము. యిది త్రికరణశుద్ధికి మార్గము. 'మనస్యేకమ్, వచస్యేకమ్, కర్మణ్యేకమ్ మహాత్మనమ్'. యిది మహత్తరమైనది. నామము అనేక రూపములుగా ప్రచరిస్తూవచ్చుచున్నది.

జయదేవుడు కేవలము భగవత్ లీలలను మాత్రమే చింతిస్తూ తనయందే భగవంతుడు వుండినట్లుగా విశ్వసిస్తూ నిత్య జీవితములో ఆటలు, పాటలు, మాటలు అన్నీ భగవంతునితో అనుభవిస్తూ, నీ ప్రేమ తప్ప నాకు అన్యప్రేమలు అక్కరలేదని విశ్వసిస్తూ ఆ ప్రేమతో తన ప్రేమను కలిపి ప్రేమస్వరూపుడుగా మారినటువంటివాడు. కానీ, జయదేవుని కీర్తనలు సరిగా అర్థము చేసుకోగల వ్యక్తులు లేకపోవటంచేత అపార్థములతో అనర్థములతో దీనిని వ్యర్థము గావిస్తూ వచ్చారు. నిజమైన భక్తులు ప్రేమను మాత్రమే కోరుదురుగాని అన్యమును కోరరు.

హనుమంతుడు తన కార్యమును పూర్తి గావించుకొని శ్రీరామచంద్రుని వార్తను సీతకు తెలిపి, తిరిగి సీత వాక్కును శ్రీ రామచంద్రునికి తీసుకుపోయే సందర్భములో 'తల్లీ నన్ను ఆశీర్వదించ'మని ప్రార్థించాడు. యీమె 'నాయనా! నీవు శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు అయిన హనుమంతుడవు. నీవు అజరామరుడవై వర్ధిల్లుగాక' అన్నది. 'నీకు ముసలితనమే లేకుండా వుండుగాక' అని చెప్పింది. కానీ, అతనికి ఆనందము కలుగలేదు. అతని ముఖములోని అసంతృప్తిని గుర్తించిన సీత 'హనుమంతా! నీవు అమృతుడవై జీవింతువు గాక!' అనింది. కానీ, దానికికూడ అతని ముఖమునందు ఆనందము కనుపించలేదు. తదుపరి 'హనుమంతా! నీవు చాలా గుణవంతుడవు. నీ గుణగణములు ముల్లోకవాసులు కీర్తింతురు గాక', అని ఆశీర్వదించింది. దానికి తాను సిగ్గుపడినట్లుగా తలవంచుకున్నాడు. సీత గుర్తించింది, యీ దృశ్యమును. కట్టకడపటికి 'రాములు నిన్ను నిరంతరము ప్రేమించుగాక' అనింది.

srisathyasaivachanamrutam

ఈ మాటతో హనుమంతుడు గంతులు వేశాడు. 'నేను కోరినది అదియే! రామప్రేమకు పాత్రుడు కావాలి. దైవప్రేమకు పాత్రుడు కాని జీవితము వ్యర్థమైన జీవితము. అలాంటి బ్రతుకు సజీవమైన సమాధి. కనుక, అట్టి ప్రేమ నాకు కావాల'ని ప్రార్థించాడు. హనుమంతుడు గొప్ప సంగీత జ్ఞానము కలవాడు. అతనికి తెలియని సంగీతము మరొకటి లేదు. నారద తుంబురాదులతో పోటీపడి గెల్చినటువంటివాడు. అటువంటి సంగీత సాధనాపరుడైన హనుమంతుడు అనాటినుండియే రామనామమును స్వేచ్ఛగా గానము చేస్తూ వచ్చాడు.

**భగవత్ప్రేమకు పాత్రుడు కావటమే సంగీతముయొక్క పరమావధి**

ఏతావాతా, సంకీర్తనయొక్క సారము ఏమిటి? భగవత్ప్రేమకు పాత్రుడు కావటమే సంగీతముయొక్క పరమావధి. తనయొక్క నాదము, తనయొక్క భావము, తనయొక్క భక్తి, శృతిలయతాళములతో చేర్చి దైవమునందు లీనము గావించటమే సంగీతముయొక్క సారము. భావము నెరిగి, భక్తికూర్చి, ప్రేమను చేర్చి, పవిత్రమైన పలుకులచేత పరమాత్ముని ప్రేమిస్తూ వర్ణించటమే గానము. పదములకు అర్థము తెలియకుండా భావమును చేర్చకుండా ప్రేమను అందులో ప్రవేశపెట్టకుండా చేసిన గానము కేవలము టేపురికార్డు అని చెప్పవచ్చును; గ్రామఫోను ప్లేటు అని చెప్పవచ్చును. నామ సంకీర్తన భావరాగతాళ సమ్మిళితమని మీరు గుర్తించాలి. 'భారత' మూడక్షరములు. 'భారత' అనే పదములో మొట్టమొదటి అక్షరము 'భా' అనగా భావము. రెండవ అక్షరము 'ర' అనగా రాగము. మూడవ అక్షరము 'త' అనగా తాళము. యీ మూడింటిని చేర్చటంచేత 'భారత' అని పేరు వచ్చేసింది. కనుక, భారతీయులు ప్రతి కార్యమునందు భావరాగతాళ సమ్మిళితమైన రీతిగా వుంటుండాలి.

**భావరాగతాళ సమ్మిళితమైనదే భారతీయుల జీవితము**

నిత్యజీవితంలో నీవు అనుసరించే ప్రతీ కార్యంలో యీ మూడింటియొక్క సమ్మేళనం అత్యవసరం. నీవు చదువుతున్నావు. చదివే సమయంలో నీ భావము, నీ రాగము, నీ తాళము యీ మూడింటియొక్క ఏకత్వం వుంటుంది. తాళమనగా ఏమిటి? అర్థం

sri sathyasai vachanamrutam

చేసుకోవటం. subject ని బాగా అర్థం చేసుకోవటం అనగా భావమును గ్రహించటం. రాగమనగా దానిపైన ప్రేమనుంచటం. ఒక లెక్చరర్ చేసే పనిలో యీ భావరాగతాళములు మూడింటియొక్క చేరిక వుంటుంది. ఆ subject ని అర్థం చేసుకోవటం, subject ని ప్రేమించటం, subject ని తగినటువంటి రీతిలో బోధించటం. ఈ మూడింటియొక్క చేరికయే యీ యొక్క ఉపదేశం. వంట చేసే సమయమునందుకూడా, మంటకి తగిన వంట, వంటకి తగిన మంట ఉప్పుకి తగిన పప్పు, పప్పుకి తగిన ఉప్పు. పప్పు చారెడు, ఉప్పు దోసెడు వేస్తే కూర పాడైపోతుంది. కనుక దేనికి తగినట్లు దానిని హద్దులో వుంచుకుని తగిన రీతిలో అనుభవించటమే భావరాగతాళ సమ్మిళితము. మొట్టమొదట భావమును అర్థం చేసుకోవాలి. త్యాగరాజు కీర్తనలను అనేక విధములుగా యిలాంటి అనర్థములచేత వ్యర్థం చేసేవారు లేకపోలేదు. త్యాగరాజు తెలుగులో పాట పాడాడు. వాటి భావమును తెలుగువారు బాగా తెల్సుకున్నారు. ఇక, రాగతాళములంతా తమిళ్‌వాళ్ళకి బాగా తెలుసు. అర్థం తెల్సుకున్నవారు తెలుగువారు, రాగతాళములతో పాడేవారు తమిళంవారు. రాగతాళములు తెలుగువారికెక్కువగా తెలియదు. పదముయొక్క అర్థము తమిళ్‌వారికి తెలీదు. ఒకానొక సమయంలో త్యాగరాజు నే పొగడకుంటే నీకేమి కొదువ రామా!' అని పాడాడు. యీ తమిళ్‌వాళ్ళకు గకారము, తకారము, బకారము, చకారము, దకారము అంతా ఒక్కటే! గొప్ప సంగీతవిద్వాంసుడొకడు యీ పాటనే పాడుతూ 'నే పకోడ తింటే నీకేమి కొదువరామా!' అని పాడాడు. 'పొగడ-పకోడ'; ఎంత వ్యత్యాసమో చెప్పండి! కనుకనే, భావము అనేది పదములయందు అత్యవసరం. కనుక, భగవత్ నామసంకీర్తన చేసే సమయంలో భావాన్ని, రాగాన్ని, తాళాన్ని చక్కగా గుర్తించి నామ సంకీర్తన చేయాలి. తెలియనప్పుడు తెల్సినవారినడిగి తెల్సుకోవటానికి ప్రయత్నించాలి.

**కలియుగమునందు నామ సంకీర్తనకు మించిన మరొక మార్గము లేదు**

ప్రేమస్వరూపులారా! సంకీర్తన చాలా పవిత్రమైన మార్గము. మనకు రాగము తెలియకపోయినప్పటికీ, యిష్టముతో ఆ నామాన్ని స్మరించాలి. ప్రేమతో నామాన్ని

sri sathyasai vachanamrutam

స్మరించాలి. భగవత్ నామస్మరణ అత్యవసరము. ఈ కలియుగమునందు నామసంకీర్తనకు మించిన మరొక మార్గం లేదు. కృతయుగములో ధ్యానము, త్రేతాయుగములో యజ్ఞము, ద్వాపరయుగములో అర్చనము, కలియుగములో నామస్మరణము. స్మరణయే తరణోపాయమనే సత్యాన్ని గుర్తించి నామస్మరణ గావిస్తూ రావాలి. ఈ గానములో వుండిన నామంయొక్క మాధుర్యం మరింతగా హృదయాన్ని ఆకర్షిస్తుంది. అనేకమంది పండితులు శ్లోకరీతిగా చెబుతారు. వారికి శ్లోకభావమే తెలుసుగానీ అందలి మాధుర్యమును అనుభవించలేరు. మరి కొంతమంది actors, పదములను గంభీరముగా ఉపయోగపెడతారు. అవి కూడను భావస్ఫూర్తిని అందించలేవు. కానీ హృదయము ఆ గానముయొక్క రసాన్ని అనుభవిస్తుంది. ఆస్తిక, నాస్తిక, యాస్తిక, నాస్తికులు అందరూకూడను యీ గానములోపల తమకు తెలియకుండానే తలలు ఊపుతారు.

ఈ యొక్క పదములచేత పద్యములు చెప్పవచ్చును. 'రామా! నన్ను కాపాడు' అని చెప్పవచ్చు. కాని యిది అంతగా హృదయానికి హత్తుకొనలేదు. పదముల చేత 'ఓ రామా! నన్ను కాపాడు' అంటే యిదికూడా అంతగా హృదయాన్ని హత్తుకోవటం లేదు. అదే 'రామా! నన్ను కాపాడు', అని పాడితే ఎంతగా హృదయాన్ని లాగుతుంది! ఎంతగా భగవంతుని హృదయాన్ని ఆకర్షిస్తుంది! గానములో యింత మాధుర్యము నిండి వుంటున్నది. కనుక, ప్రతివారు మీరు చక్కగా పాడలేకపోయినప్పటికి పాడేటువంటివారిని అనుసరిస్తూ మీరుకూడను పాడటం మంచిది. కానీ, కొంతమంది నోళ్ళు యేమాత్రం కదలవు. లోపల పాడు కుంటున్నామంటారు. అది సరైన తృప్తినివ్వదు. వంటరూములో అన్ని వంటలు చేసి పెట్టాం. వంటరూములో వంటలున్నాయంటే నీ పొట్టలోకి వస్తున్నాయా? అదేవిధంగా భావము వున్నప్పుడు అది నాలుకపై రావాలి, పెదవులపై రావాలి. అదే సంకీర్తన. అనగా గొంతువిప్పి తనయొక్క స్వరము ఎంతవరకు పోతుందో అంతవరకు భగవన్నామాన్ని ఉచ్చరించాలి. అప్పుడే నామ సంకీర్తన భగవంతుని హృదయాన్ని కరగిస్తుంది. అప్పుడే భగవంతుడు నిన్ను రక్షించగలడు. బావిలో పడినవాడు 'నేను బావిలో పడ్డా, నేను బావిలో పడ్డా,' అంటే ఎవరూ వచ్చి రక్షించరు. గట్టిగా గొంతువిప్పి 'అయ్యో! నేను బావిలో పడ్డాను' అని

sri sathyasai vahini amrutam

అరిచినప్పుడే ఎవరైనా విని నిన్ను రక్షించగలరు. అనగా, తనయొక్క కీర్తన అభిమాన, మమకారములు లేకుండా స్వేచ్ఛగా గొంతెత్తి పాడాలి. నోరు యిచ్చినది ఎందుకోసం?

**మూతిని యిచ్చినదెందుకో తెలుసా?**
**ముద్దను నోటికి అందించుటకా!**
**చేతులిచ్చిన దెందుకో తెలుసా?**
**పిచ్చిపనులు చేయటానికా? కాదు**
**భగవంతుని అర్చన చేయుటకు**
**పాదములిచ్చిన దెందుకో తెలుసా?**
**సందులుగొందులు తిరుగుటకా!**
**కాదు కాదు, భగవంతుని మందిరము చుట్టుటకు**
**చెవులను యిచ్చిన దెందుకో తెలుసా?**
**ఊరివారి సుద్దులవినుటకా! కాదు కాదు,**
**భగవన్నామాన్ని వినటానికి**
**కన్నుల నిచ్చిన దెందుకో తెలుసా?**
**దినానికి మూడు సినిమాలు, రెండు టీవీ ప్రోగ్రామ్‌లు**
**చూడడానికా! కాదు కాదు,**
**భగవంతుని సుందర రూపాన్ని దర్శించుటకు**

కనుక, యీ యింద్రియములను పవిత్రము గావించుకొని, మనస్సును పరిశుద్ధము గావించుకొని చిత్తశుద్ధిచేత భగవంతుని చింతించాలి.

**కలియుగమంతా కల్మషయుగమైపోయింది**

ప్రేమస్వరూపులారా! నామసంకీర్తనయందున్న మాధుర్యము, ఆనందము యిట్టిది, అట్టిది అని వర్ణించుటకు ఎవ్వరికి సాధ్యము కాదు. నీవు ఎంత భక్తి శ్రద్ధలతో స్మరింతువో అంత భక్తి శ్రద్ధలతో ఫలిస్తుంది. దానికి తగిన ఆనందము కూడను అందిస్తుంది. పిండికి తగిన రొట్టె. తిండికి తగిన త్రేపు. నీవు ఎంత భావముతో

srisathyasaivachanamrutam

చింతిస్తావో అంత నీకు భావసిద్ధి కలుగుతుంది. కనుక, నామమును అందరుకూడా ఏకంగా వుచ్చరించటానికి తగిన కృషి చెయ్యాలి. ఈనాడు ప్రపంచములో పంచభూతములుంటున్నాయి. జలము, పృధ్వి, శబ్దము, అగ్ని, వాయువు యివన్నీ మలినమైపోయాయి. పరిశుద్ధమైన శబ్దము లేదు. పరిశుద్ధమైన భూమిలేదు. అంతా మలినమైపోయింది. కలియుగమంతా కల్మషయుగమైపోయింది. దీన్ని పవిత్రముగావించాలంటే భగవన్నామస్మరణే దీనికి ఆధారము. ఒక్క చిన్న ఉదాహరణము. మనము ఎట్టి మంట వేస్తామో అట్టి పొగనే పోతుంది. ఎట్టి పొగనో అట్టి మేఘములు తయారౌతాయి. ఎట్టి మేఘములో అట్టి వర్షము కురుస్తుంది. ఎట్టి వర్షమో అట్టి పంట పండుతుంది. ఎట్టి పంటనో అట్టి వంట మనం తింటాము. ఎట్టి వంటనో అట్టి జన్మ మనకు లభిస్తుంది.

**భగవన్నామ సంకీర్తనద్వారా వాతావరణము పరిశుద్ధమవుతుంది**

ఈనాడు మన జీవితమంతా యేరీతిగా గడుస్తున్నాది? మనము నిత్యజీవితములో వీడియోలు, సినిమాలు చూచి మనకు పుట్టే బిడ్డలు సినీమా బిడ్డలే పుడుతున్నారు. అనగా ఏమిటి? అంతా actions & stunts. దీనికి కారణం ఏమిటి? తల్లితండ్రులు చేసే దోషమే! పూర్వము బిడ్డ గర్భములో వుండినప్పుడు ఏవైనా పవిత్రమైన చరిత్ర-ప్రహ్లాద చరిత్రనో, ధృవచరిత్రనో, సత్యవంతుని చరిత్రనో యిలాంటివంతా ప్రబోధిస్తూ వచ్చేవారు. సుభద్ర గర్భము ధరించినప్పుడు అర్జునుడు పద్మవ్యూహమును గురించి చెబుతూ వచ్చాడు. ఆ సమయానికి కృష్ణుడు అక్కడ ప్రవేశించి 'అర్జునా! ఎవరు వింటున్నారనుకుంటున్నావు, గర్భములో నున్న శిశువు వింటున్నాడు. యిప్పుడే యుద్ధసంబంధమైన విషయాలు బోధించవద్దు' అన్నాడు. ఆ సమయానికి అర్జునుడు పద్మవ్యూహములో ప్రవేశించేవరకు చెప్పాడు. కానీ వచ్చే మార్గము చెప్పలేకపోయాడు. అందువలన తరువాత కౌరవ, పాండవ యుద్ధములో అభిమన్యుడు పద్మవ్యూహములో ప్రవేశించాడుగానీ వచ్చే విధానము తెలియక ప్రాణము వదిలాడు. దీనిపై రష్యాలో, అమెరికాలో అనేక పరిశోధనలు చేస్తూ వచ్చారు. ఎలాంటి తిండో అలాంటి జీవితము వస్తుందని ఆదర్శము.

srisathyasaivachanamrutam

ఒక డాక్టరు ఒక గర్భములో నున్న శిశువుకు నిత్యము ఒక ఔన్సు apple juice యింజక్షనుతో యిస్తూ వచ్చాడు. ఆ పిల్లవాడు పుట్టిన తరువాత వాడికి apple అంటే యిష్టమై పోయింది. అనగా, గర్భములో వుండినప్పుడు ఎలాంటి భావములు, ఎలాంటి రుచులు, ఎలాంటి పదార్థములు తాను అనుభవిస్తాడో అదే ప్రత్యక్షంగా జన్మించిన తరువాత అనుభవిస్తాడు. కనుక, బాహ్యములో వుండిన మాలిన్యమైన గాలినంతా పరిశుద్ధము చేయదలచుకున్నప్పుడు భగవన్నామసంకీర్తన చేస్తే యిదంతా ఆ విద్యుత్‌శక్తిలో చేరిపోతుంది. యిదంతా తరంగములుగా మారుతుంది. ఈ తరంగములు శాశ్వతముగా వుంటాయి. కొద్ది స్థాయికి పోయేంతవరకు మార్పులు చెందుతూ వుంటాయి. ఒకస్థాయి దాటిన తరువాత శాశ్వతంగా నిల్చిపోతాయి.

దీనికి చిన్న ఉదాహరణము. ఈనాడు ఢిల్లీలోపల 7 గంటలకు రేడియోలో ఒక ప్రోగ్రాము వుంటున్నాది. అదే సమయములోపల ప్రశాంతినిలయములో రేడియో పెట్టుకుంటే అవే పదములు, అదే గొంతు యిక్కడ వస్తాయి. ఢిల్లీనుంచి ప్రశాంతినిలయమునకు ఒక వైరు పెట్టారా? విద్యుత్ తరంగములలో చేరి వాయువులో చేరి క్రమక్రమేణా సర్వత్రా వ్యాపించిపోతున్నాయి. కనుక, శబ్దములో యింత మహత్తరమైన శక్తి వుంటున్నాది. ఘంటసాల ఎంతో మాధుర్యంగా పాడేటువంటివాడు. కానీ యీనాడు ఘంటసాల మరణించినప్పటికిని టేపురికార్డు అతని గొంతును వినిపిస్తున్నది. అనగా మన శబ్దమంతా విద్యుత్ తరంగములలో చేరి లీనమైపోతుంది. ఈనాడు దుశ్శబ్దములచేత వాయువు చాలా కలుషితమైపోయింది. ఈ పవిత్రమైన భగవన్నామసంకీర్తనచేత ఆయొక్క మాలిన్యమును కొంతవరకు పరిశుద్ధము గావించవచ్చు. అదే విధముగ భగవచ్చింతన, భగవత్ జపము, భగవన్నామము, భగవత్ సంకీర్తన యివన్నీ పంచభూతములను పవిత్రము గావించే శక్తి సామర్థ్యములు కలిగియుంటున్నవి. దీనికంటే యింక పరిశుద్ధపరచేది మరొకటి లేదు.

**నాలుక యిచ్చినది నామస్మరణ చేయటానికే!**

గంగను పరిశుద్ధము చేయాలని కొన్నివేల కోట్లు ఖర్చు పెట్టుకోడానికి ప్రయత్నించారు.

srisathyasaivacnamrutam

కానీ, ఆ పరిశుద్ధము చేసే విధానాన్ని మొట్టమొదట గుర్తించాలి. పురుషప్రయత్నముతో చేసే పనులుకూడను చక్కగా చేయాలి. తలపైన నీరు పోస్తూ కాళ్లపైన టర్కీ టవలుతో తుడుస్తుంటే ప్రయోజనం ఏముంది? ఒక తట్టు గంగను పవిత్రము చేసే ప్రయత్నము చేస్తూ సిటీలోంచి వచ్చే డ్రైనేజీ వాటరంతా గంగలో కలుపుతుంటే యింక అది ఎట్లా పరిశుద్ధమవుతుంది? మొట్టమొదట దానిని నిలబెట్టాలి. దానికి వేరే తగిన మార్గమునేర్పరుచుకోవాలి. అదే విధముగా, మనస్సులోపల వచ్చే దుర్భావములను మరొక మార్గములో పంపించి, ఆ చేరిన దుర్భావములను పవిత్రమైన నామముచేత పరిశుద్ధపరచటానికి ప్రయత్నించాలి. ప్రతి వ్యక్తి భజన సమయములోపల గొంతెత్తి పాడాలి. ఆ పాడనివాని నాలుక కేవలము కప్ప నాలుక మాత్రమే! కప్ప నోరు తెరచి అరుస్తూ వుంటుంది, ఏమి ప్రయోజనము? నాలుక యిచ్చినది నామస్మరణ చేయటం కోసమనే! కనుక, ప్రతి వ్యక్తికూడను నామస్మరణ తగిన శ్రద్ధాభక్తులతో చేసి తద్వారా ఆనందముననుభవించి, యీ గాలిని పవిత్ర పరచి, దేశానికి ఉపకారము గావించే ప్రయత్నానికి పూనుకోవాలి.

**(తేదీ 03-03-1992న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam